


ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 12,13 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన వై.అఖిల్,ఎం.ధనుష్‌సాయి తృతీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బాలికలు వ్యక్తిగత విభాగంలో వై. అఖిల్ , ఎం. ధనుష్ సాయి బ్రాంజ్ మెడల్ సాధించి సెప్టెంబరు గుజరాత్‌లో జరుగనున్న జాతీయ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. బాలికల టీమ్ కూడా బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా వారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభస్వామి, సిఇఒ రాం గోపాల్ వర్మ , శిక్షకులు చారి ప్రసాద్ అభినందించారు.



టిడిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

చీపురుపల్లిలో ఉద్రిక్తత

- వైసిపి సవాల్‌పై సై అన్న టిడిపి
- స్టాంప్ పేపర్లతో కనక మహాలక్ష్మి ఆలయానికి బయల్దేరిన తెలుగు తమ్ముళ్లు
- అడ్డుకున్న పోలీసులు
- నాగార్జునతో సహా పలువురి గృహ నిర్బంధం
- ఆంక్షలను తెంచుకుని బయటకు వచ్చిన నాయకులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-గరివిడి

చీపురుపల్లి నియోజకవర్గ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. వైసిపి, టిడిపి సవాళ్లు, ప్రతి సవాళ్లతో నియోజకవర్గ కేంద్రం వేడెక్కుతోంది. ఈనేపథ్యంలో గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉగాది తర్వాత టిడిపి, జనసేన ఉండబోవని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ శ్రీకాకుళంలో చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. బొత్స వ్యాఖ్యలపై రాతపూర్వకంగా అగ్రిమెంటు ఇవ్వాలని చీపురుపల్లి టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. దీంతోపాటు చీపురుపల్లి ఆర్ఇఎస్ పరిధిలోని ఎనర్జీ అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని, పలువురు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని, దీన్ని సైతం తాము నిరూపిస్తామని స్పష్టం చేశారు. బాండ్ పేపర్ల మీద రాసుకుందామని.. తాము నిరూపించిన మరుక్షణం వైసిపి నాయకులు గుండు గీసుకుని రాజకీయ సన్యాసం చేస్తారా? అని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు శ్రీ కనక మహాలక్ష్మి ఆమవారి ఆలయం వద్ద ఇరు పక్షాలకు చెందిన నేతలు చర్చకు సిద్ధమయ్యారు. వైసిపి నాయకులు ఉదయం 10.30గంటల నుంచి 11 గంటల వరకు ఆలయం వద్దకు రండి అంటూ సవాల్ చేశారు.



టిడిపి నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

స్టాంప్ పేపర్లతో కనకమహాలక్ష్మీ ఆలయానికి బయల్దేరిన టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి కిమిడి నాగార్జునను, నాయకులు రౌతు కాము నాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. శాంతిభద్రతల సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని, ఇరు పార్టీల నాయకులు సహకరించాలని చెప్పిన పోలీసులు... ఇరుపార్టీల నాయకులను గృహ నిర్బంధం చేశారు. నాగార్జున ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అయితే పోలీసుల ఆంక్షలను ఛేధించుకుని పలువురు టిడిపి నాయకులు కనక మహాలక్ష్మి ఆలయానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశారు.

గ్రూప్-1లో కొలువుదీరారు



డిఎస్‌పిగా ఎంపికైన ఉదయ పావని

ప్రజాశక్తి-నెల్లిమర్ల, గుర్ల, బొబ్బిలి

జిల్లాకు చెందిన పలువురు గురువారం వెలువడిన గ్రూప్-1లో ఫలితాల్లో సత్తా చాటి, కొలువులు సాధించారు.


- నెల్లిమర్ల మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన కెల్ల ఉదయపావని డిఎస్‌పి పోస్టు సాధించారు. గ్రూప్-1 పరీక్ష రాసి డిఎస్‌పి పోస్టుకి ఎంపిక య్యారు. కాకినాడ జెఎన్‌టియులో బిటెక్ పూర్తిచేశారు. పదో తరగతి వరకు అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదివారు. ఉదయ పావని డిఎస్‌పిగా ఎంపిక కావడంతో వైస్‌ఎంపిపి సారికి వైకుంఠంనాయుడు, గ్రామస్తులు అభినందించారు. ఉదయ పావని తండ్రి నారాయణ అప్పలనాయుడు (బుల్లయ్య) (డీలర్)గా సేవలు అందిస్తున్నారు. తల్లి భారతి అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు.
- గుర్ల మండలం నాగళ్లవలస గ్రామానికి చెందిన ఎవిఆర్ మూర్తి గ్రూప్-1లో సత్తాచాటి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌కు ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం అమరావతిలో మెడికల్ అండ్ హెల్త్ కార్యాల యంలో ఎఒగా పనిచేస్తున్నారు.
- రామభద్రపురం మండలం బూసాయవలసకు చెందిన మడక కృష్ణమూర్తి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆయనది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు రామారావు, లక్ష్మి. ఎంవిజిఆర్ కళాశాలలో ఎంటెక్ చదివిన కృష్ణమూర్తి విజయవాడలో టెక్నికల్ ఎస్ఐగా పనిచేస్తూ విశాఖలో గ్రేహౌండ్స్ ఎస్ఐగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. మూడో ప్రయత్నంలో గ్రూప్-1లో ప్రతిభచాటి, డిప్యూటీ కలెక్టర్ కొలువు సాధించారు.





ఎవిఆర్ మూర్తి (జిల్లా రిజిస్ట్రార్); కృష్ణమూర్తి (డిప్యూటీ కలెక్టర్)

మూలనపడ్డ లిఫ్ట్



- అందని సాగునీరు
- ఎండిపోతున్న వరినాట్లు
- మరమ్మతులకు నిధుల్లేవు : ఎపిఐడిసి ఎఇ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలం చుట్టూ నదులు ప్రవహిస్తున్నా ఈ ప్రాంత రైతాంగానికి సాగుకు చుక్క నీరందడంలేదు. దీంతో అనేక ఏళ్లుగా రైతులు సాగునీటి సౌకర్యం కోసం పాలకులకు పలుమార్లు విన్నపాలు విన్నవించుకోగా, ఎట్టకేలకు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో రైతులకు సాగుకు ఎలాంటి అంతరాయం లేకుండా సాగింది. అంత వరకూ బాగానే ఉంది. అయితే ఈ ఎత్తిపోతల పథకం గత కొంత కాలంగా మరమ్మతులకు గుర్రై పడకేసింది. ఇక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరమ్మతులు చేయాలని అధికారులను కోరగా, తమ వద్ద నిధుల్లేవని చేతులెత్తాశారు. దీంతో రైతు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇదీ మండలంలోని ఖరాసువలస పంచాయతీ దత్తివలస వద్ద గల బురాడమ్మ ఎత్తిపోతుల పథకం పరిస్థితి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని ఖరాసువలస ప్రాంత రైతులు ఎన్నో ఏళ్లుగా సకాలంలో వర్షాల్లేక సాగునీటికి చాలా ఇబ్బందులు పడుతుండే వారు. తమ పరిస్థితిపై స్థానిక నాయకులకు, ప్రభుత్వానికి అనేకమార్లు రైతులు మొరపెట్టుకున్నారు. వీరి ఇబ్బందులను చూసి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో సుమారు రూ.2కోట్ల 73లక్షలతో స్వర్ణముఖి నదీ ఒడ్డున మండలంలోని ఖరాసువలస పంచాయతీ దత్తివలస వద్ద బురాడమ్మ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా సుమారు 330 ఎకరాలు వరకు సాగునీరందుతుంది. దీంతో సుమారు 250 మంది సన్న, చిన్న కారు రైతులు ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ఇబ్బందులు లేకుండా సాగింది.. ఎత్తిపోతల పథకం నది ఒడ్డున ఉండడంతో ప్రతి ఏటా వరదలు, తుపాన్ల వల్ల మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులు మరమ్మతులకు గురయ్యేవి. రైతులు నీటి పన్నులను ఎకరాకు రూ.500 చొప్పున వేసుకొని వాటి మరమ్మతులకు, అందులో పనిచేసే సిబ్బందికి జీతాలకు సరిపోయేవి. కానీ వరి పంటకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడులు పెద్ద మొత్తంలో ఉండడంతో పండించిన పంట పెట్టుబడులకే సరిపోతుండడంతో నీటి పన్నులు కూడా చెల్లించే పరిస్థితికి రైతులు వచ్చేశారు. దీంతో పథకం నిర్వహణా భారం అవ్వడం, ఇప్పుడు ఇది మరమ్మతులకు గురవ్వడంతో బాగు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో సాగునీటికి రైతులు నానా అవస్థలుపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పథకానికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి : రైతులు

ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టాలని ఎత్తి పోతల పథకం కన్వీనర్ బూస తవుడు, రైతులు రామారావు , శ్రీను, అప్పల నాయుడు, సింహాచలం, మాధవ, తవుడు ఎపిఐడిసి ఎఇ శ్రీనివాసరావును కోరారు. పథకాన్ని ప్రారంభించి పదేళ్ల పూర్తికావడంతో పంపులు, ఎలక్ట్రికల్, పైపులు, రిటర్నింగ్ వాల్వు మొదలైనవి మరమ్మతులకు గురయ్యాయన్నారు. వీటి అన్నింటినీ పరిశీలించి ఎంత మొత్తంలో నిధులు అవసర ముందని, అంచనా వేసి అందులో రైతులు 25 శాతం వరకు నిధులు అందజేస్తే మిగతాది ప్రభుత్వం మంజూరు చేస్తుందని, దీని కోసంపై అధికారులకు నివేదిక పంపి మరమ్మతులు చేపడతామని ఎఇ తెలిపారు. అనంతరం ఎత్తి పోతల పథకం కన్వీనర్ బూస తవుడు మాట్లాడుతూ దీన్ని ప్రారంభించినప్పటి నుంచి కన్వీనర్‌గా తాను పనిచేస్తున్నానని, ఐదేళ్ల వరకు ఎటువంటి మరమ్మతులు రాలేదని, కానీ ప్రతి ఏటా వరదల వల్ల మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులు రిపేర్ అవుతున్నాయని, ఇప్పుడు పూర్తిగా పంపులు రిపేర్లు కావడంతో రైతులు అంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని కోరారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

24న చలో విజయవాడకు పిలుపు • గంటస్తంభం వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ (ఆప్కాస్) కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం గంటస్తంభం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్ అమలు , రిటైర్మెంట్ బెనిఫిట్స్ , సిపిఎస్ రద్దు, సరెండర్ లీవ్ డబ్బులు చెల్లింపు, రామ తీర్థాలు, ముషిడిపల్లి, నెల్లిమర్ల పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కీ సిస్టం రద్దు, క్లాప్ వాహన డ్రైవర్లకు రూ.18500 జీతం అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు రామచంద్రరావు, తిరుమల రావు, సూరి, వంశీ, రామకృష్ణ, రమణ, కృపారావు, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల రాస్తారోకో

బొబ్బిలి : మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ బొమ్మ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం, ఎ.సురేష్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని గద్దె దింపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకట్, గౌరీస్, కార్మికులు పాల్గొన్నారు.

రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

నెల్లిమర్ల : ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన తుపాకుల రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ఏ. జగన్మోహన్‌రావు, నాయకులు బాబురావు అధికారులను, నగర పంచాయతీ పాలకవర్గాన్ని గురువారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో మరణించిన కార్మికుల బిడ్డలకి ఉపాధి కల్పిస్తున్నారని, ఇక్కడ ఎందుకు తుపాకుల రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వటం లేదని ప్రశ్నించారు. పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సిపిఎస్ రద్దు, సరెండర్ లీవ్ డబ్బులు చెల్లింపు, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్ అమలు తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఆగస్టు 24న చలో విజయవాడకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా గురువారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, నాయకులు లక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

రైళ్లలో నేరాల నియంత్రణకు చర్యలు

ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం రైల్వే స్టేషను, స్టేషను ఔటర్లులోను, రైళ్లలోను నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. గురువారం రైల్వే పోలీసు (జిఆర్‌పి), రైల్వే పోలీసు ఫోర్సు (ఆర్‌పిఎఫ్) అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశమయ్యారు. రైల్వే స్టేషను, స్టేషను పరిసరాలు, రైళ్లలో నేరాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఇటీవల కాలంలో రైళ్లలో ప్రయాణిస్తూ, ఫుట్ బోర్డుల వద్ద కూర్చొని లేదా నిలుచున్న ప్రయాణికుల సెల్ ఫోనులు చూస్తుండగా కొంతమంది ఆకతాయిలు వారి చేతుల్లోని మొబైల్ ఫోన్లను కర్రతో కొట్టి కింద పడగొట్టి, మొబైల్ ఫోన్లను కాజేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా స్టేషన్ ఔటర్లులో ఆగిన రైళ్లలోకి ఆకతాయిలు ప్రవేశించి, భోగీల్లో ఛార్జింగు పెట్టిన సెల్ ఫోనులు, ల్యాప్ టాప్లను కాజేస్తున్నట్లుగా పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, జిల్లా పోలీసులతో ఏర్పడిన ఈ ప్రత్యేక బృందాలు ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెడతాయన్నారు. ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు సంయుక్తంగా ట్రెయిన్ బీట్లు, గస్తీ, ట్రోలింగు ముమ్మరం చేస్తున్నామన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా ఆకస్మికంగా చేపట్టి, రైళ్లలోను, స్టేషను ఔటర్లలోను అనుమానస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం, విచారణ చేయడం, వేలి ముద్రలను సేకరించడం, వారి బ్యాగులను తనిఖీ చేయడం చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌బి సిఐ కెకెవి విజయనాథ్, జిఆర్‌పి ఎస్ఐ వి.రవివర్మ, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ బి.శ్రీధర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

20న జిల్లా స్థాయి ఓపెన్‌చెస్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా అండర్-13 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఓపెన్, బాలికల విభాగంలో ఎంపికను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జ్వాలాముఖి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను రింగ్‌రోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన క్రీడాకారులు విజయనగరంలో అక్టోబర్ 27,28,29,30 తేదిలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని తెలిపారు. ఈ పోటీలలో అండర్-13 క్రీడాకారులు 1-1-2010 తర్వాత పుట్టిన వారై ఉండాలని, తప్పని సరిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. ఓపెన్‌లో ఇద్దరిని, బాలికల విభాగంలో ఇద్దరిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పేర్లు నమోదుకు సెల్ 9703344488ను సంప్రదించాలని కోరారు.

అన్ని విధాలా నగర అభివృద్ధి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 21వ డివిజన్ ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఆ డివిజన్‌లోని వైఎస్ఆర్ జంక్షన్, గెడ్డ వీధి ప్రాంతాలలో రహదారులు కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, జోనల్ ఇన్చార్జి కంటుభుక్త తవిట్రాజు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికై రహదారులను. కల్వర్టులను, కాలువలను నిర్మించే చర్యలలో భాగంగా శంకుస్థాపనలు చేశారన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, కనకల గిరి, కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

గడప గడపకూ ..

నగరంలోని 50వ డివిజన్ వైయస్సార్ నగర్ లో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలు తెలియజేస్తూ లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీసారు. రహదారి సౌకర్యాలు సరిగా లేవని స్థానికులు చెప్పడంతో అవసరమైన ఏర్పాట్లు చేపడతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు తోనంగి జగన్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 29, 42 డివిజన్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు కోలగట్ల కృష్ణారావు, డాక్టర్ వి.ఎస్ ప్రసాద్, ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీస్తూ సమస్య పరిష్కారానికై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ ఓగిరెడ్డి సతీష్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు గుణశేఖర్ పాల్గొన్నారు.

విజయనగరం విజయదుందుభి

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విశాఖ జట్టుపై 31పరుగుల తేడాతో విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియంలో అండర్-16 విభాగంలో మూడురోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విజయనగరం జట్టు విశాఖపట్నం జట్టుపై 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 41ఓవర్లలో 133 పరుగులకు అలౌట్ కాగా విశాఖ జట్టు 76 ఓవర్లలో 246 పరుగులకు ఆల్ అవుటై 113 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 70.5 ఓవర్లలో 261 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 149 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు బ్యాట్స్‌మెన్లు విజయనగరం జట్టు బౌలర్ల దాటికి 117 పరుగులకే ఆల్ అవుటై 31పరుగులు తేడాతో పరాజయం పాలయ్యింది. విజయం సాధించిన విజయనగరం జట్టు క్రికెట్ క్రీడాకారులను, కోచ్‌లు రమేష్, బహదూర్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్.ఎల్.ఎన్ రాజు, ట్రెజరర్ పి. సీతారామరాజు, సెలక్టర్లు పిఎస్ఎన్ వర్మ, సర్పరాజ్ బంగార్రాజులు అభినందించారు.

తొలి ఇన్నింగ్స్ ఆదిక్యంతో తూర్పుగోదావరి జట్టు విజయం

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య అండర్ 16 విభాగంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్ ఆదిక్యంతో శ్రీకాకుళం జట్టుపై విజయం సాధించింది. ఈ విజయంతో తూర్పుగోదావరి జట్టుకు మూడు పాయింట్లు, శ్రీకాకుళం జట్టుకు ఒక పాయింట్ లభించాయి.



విజయం సాధించిన అండర్-16 జట్టు, కోచ్‌లు

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఐక్య పోరాటం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి- రేగిడి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించుకోవడానికి కార్మికులంతా సంఘటితంగా పోరాడుదామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ఉణుకూరు గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల 3వ మహాసభ సిఐటియు మండల నాయకులు పోరెడ్డి విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించారు. మహా సభలకు పలు గ్రామాల నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న పథకాలను అమలు చేయకుండా నవరత్నాల పేరుతో నిర్మాణ కార్మికులను మోసం చేస్తున్నారన్నారు.

రాష్ట్రంలో సెస్ రూపంలో వందల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా కరోనా కష్టకాలంలో కార్మికులకు ఇవ్వలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నా, వాళ్లకు సంక్షేమ బోర్డు ద్వారా ఎటువంటి సహకారం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను చిన్న చూపు చూస్తుందన్నారు. మ్యారేజ్ గిఫ్ట్‌లు, డెలివరీ ఖర్చులు సంక్షేమ బోర్డు ద్వారా ఇవ్వాలని అవి ఇవ్వడం లేదని విమర్శించారు. కార్మికుల కష్టార్జితంతో వచ్చిన వందల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చులు పెట్టి వాళ్ల డబ్బులు లూటీ చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె సురేష్, కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మూకుమ్మడిగా ఉద్యమానికి సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రవిశంకర్, అధ్యక్షులు ఎం.త్రినాధ్, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీ 20 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

మండల కార్యవర్గం ఇదే..

సిఐటియు మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. మండల గౌరవ అధ్యక్షులు విశ్వనాథం, అధ్యక్షులు ఎం. త్రినాధ, కార్యదర్శి డి. రవిశంకర్‌లను ఎన్నుకున్నారు. మిగిలినవారు సభ్యులుగా ఉన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయడం లేదు

సమావేశంలో సభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి - డెంకాడ

అధికారులు బాధ్యతగా పనిచేయడం లేదని గత సమావేశంలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేయడం ఎంతవరకు సమంజసమని సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ నివేదికలను వివరిస్తుండగా సభ్యులందరూ ఒక్కసారిగా లేచి గత సమావేశంలో సమస్యల పరిష్కారం కాకుండా మరల అదే సమస్యలు గ్రామాల్లో పట్టిపీడిస్తున్నాయని ప్రశ్నించారు. అర్‌డబ్ల్యుఎస్ జెఇ మాట్లాడుతుండగా సభ్యులందరూ ఒక్కసారిగా లేచి గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తమ దృష్టికి తీసుకురాకుండా జెఇ తనకు నచ్చినట్లుగా గ్రామాల్లో పనులు చేసుకుంటూ పోతున్నాడని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డి కొల్లం పంచాయతీ పరిధిలో ముంగినాపల్లి గ్రామంలో గత నాలుగేళ్ల నుంచి మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని సభ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువచ్చిన సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామ సర్పంచ్ అట్టాడ శివకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరిస్తారా లేదా అని ప్రశ్నించారు. డి. తాళ్లవలస పంచాయతీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ ఎఇ మాట్లాడుతుండగా గుణుపూర్ సర్పంచ్ మండల సత్యవతి మాట్లాడుతూ పంచాయతీ పరిధిల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే పంచాయతీ వారు ఎటువంటి సర్టిఫికెట్ ఇవ్వకుండా దానికి కరెంట్ మీటర్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశానికి ఎందుకు రావడం అని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి సభలో అడిగిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తేనే వస్తామని సర్పంచులు తెగేసి చెప్పారు. ఎప్పటికప్పుడు మొక్కుబడిగా సమావేశాలు జరుగుతున్నాయి తప్ప సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయడం లేదని సభ్యులంతా మండిపడ్డారు. సమావేశాలకు ఎమ్మెల్యే హాజరు కాకపోవడంతో చాలా మంది సర్పంచులు, ఎంపిటిసిలు కూడా హాజరు కావడం లేదు. ఒకవేళ వచ్చినా తమ సమస్య పరిష్కారం కాదన్న ఆలోచనతో మరి కొంత మంది సమావేశాలకు రావడం లేదని తెలిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సభ్యులు చెప్పిన సమస్యలను పరిష్కరించే విధంగా సమావేశాలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, పిఎస్‌సిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇని ప్రశ్నిస్తున్న డి.కొల్లాం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ

మారిన మైదానం రూపురేఖలు


క్రీడా మైదానాన్ని చదునుచేస్తున్న జెసిబి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల మైదానం రూపురేఖలు మారుతున్నాయి. గురుకుల ఆవరణలో సుమారు 5.60 ఎకరాల విస్తీర్ణంలో దట్టంగా ముళ్లపొదలు పెరిగాయి. మైదానం ప్రమాదకరంగా మారిన వైనంపై 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు స్పందించి, మైదానాన్ని పరిశీలించారు. సొంత నిధులతో జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసి, మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. నాలుగు రోజులుగా పనులు చేపట్టడంతో ఇప్పటికే గురుకులం మైదానం కొత్తరూపు సంతరించుకుంది. క్రీడా మైదానం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో మిగతా ముళ్లపొదలు, బండరాళ్ల తొలగింపు పూర్తవుతుందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు.


ఎంపిడిఒపై చర్యలేవీ?

గురుకుల మైదానం అభివృద్ధి కోసం కలెక్టర్‌కు స్పందనలో వినతి అందజేస్తే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్‌ను ఆదేశించారు. ఒకరోజు కొద్దిమంది మహిళలతో అరగంట పనిచేయించి, మైదానం అభివృద్ధి చేసినట్లు ఎంపిడిఒ కలెక్టర్‌కు నివేదించారు. తీరా అక్కడి ముళ్లపొదలు, బండరాళ్లు అలాగే ఉండటంపై 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో టిడిపి నాయకులు స్పందించి, అభివృద్ధి చేస్తున్నారు. కానీ కలెక్టర్‌కు తప్పుడు నివేదిక పంపించిన ఎంపిడిఒపై నేటికీ చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై బక్కునాయుడుపేట గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పెనుమత్స జయంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాజీ మంత్రి కీర్తి శేషులు పెనుమత్స సాంబశివరాజు 90వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన స్వగ్రామం మొయిద విజయరాంపురంలో ఆయన జయంతిని పురస్కరించుకుని వారి కుమారులు ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు (సురేష్ బాబు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సాంబశివ రాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి సాంబశివరాజు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ ఎంతో ప్రజాభిమానం పొందిన సాంబశివరాజు విగ్రహం నిర్మాణం తుది దశలో ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులతో సంప్రదించి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అక్టోబర్ చివరి వారంలో గాని, నవంబరు మొదటి వారంలో గాని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, మొయిద విజయరాంపురం సర్పంచ్ అట్టాడ కృష్ణ, పెనుమత్స కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.


పెనుమత్స సాంబశివరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సురేష్‌బాబు, నాయకులు

ఇళ్ల నిర్మాణంపై నేడు ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా ప్రత్యేక అధికారి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ మైదీన్ శుక్రవారం సమీక్షించనున్నారని ఆ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరక్టర్ వి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలసి కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమీక్ష సమావేశంలో ఆశాఖ క్షేత్రస్థాయి అధికారులు, ఎంపిడిఒలు, ఇంజనీరింగ్ సహాయకులు, వార్డు పరిపాలన సహాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. గృహనిర్మాణంతో ప్రమేయం కలిగి వున్న డ్వామా, విద్యుత్, గ్రామీణ నీటిసరఫరా, ప్రజారోగ్య ఇంజినీరింగ్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్న జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సమీక్షించి, అనంతరం ఆ కాలనీలను సందర్శిస్తారని చెప్పారు.

తెర్లాం స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-తెర్లాం


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీధర్

తెర్లాం పోలీస్‌స్టేషన్‌ను గురువారం డిఎస్‌పి శ్రీధర్ గురువారం సందర్శించారు. ముందుగా ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కవాతు నిర్వహించి, ఘన స్వాగతం పలికారు. అనంతరం డిఎస్‌పి శ్రీధర్ రికార్డులు పరిశీలించారు. మండలంలో క్రైమ్ రేట్ ఎలా ఉంది, మాదకద్రవ్యాలు, జూదం, రోడ్డు ప్రమాదాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో లాఅండ్ ఆర్డర్ పరిస్థితి ఎలా ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో డిఎస్‌పి మాట్లాడుతూ మండలంలో లా అండ్ ఆర్డర్ అదుపులో ఉందన్నారు. క్రైమ్‌రేట్ బాగా తగ్గిందని తెలియజేశారు. ఉద్దవోలు గ్రామంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని చెప్పారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని పోలవానివలసలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రం, దేశంలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వైసిపి, బిజెపి పాలన సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజా సంక్షేమ పాలన అందిస్తుందన్నారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి

లీకులతో తాగునీరు వృథాగా పోతోంది. మున్సిపాలిటీలోని నాయుడు కాలనీలో రెండు చోట్ల పైపులైన్ లీకులతో తాగునీరు వృథా అవుతోంది. దీంతో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదు. అధికారులు స్పందించి లీకులను నివారించి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-తెర్లాం


ఎంపిడిఒను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు స్వీకరించిన ఎంపిడిఒ రామకృష్ణను యుటిఎఫ్ నాయకులు, ఐసిడిఎస్ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మునిస్వామి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఎంపిడిఒ రామకృష్ణ చేస్తున్న కృషిని అభినందించారు. అందరి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమైందని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథరావు, సిడిపిఒ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

సెప్టెంబరు 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోసెఫిన్ కోరారు. స్థానిక కోర్టులో గురువారం లోక్ అదాలత్‌పై పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కోర్టు పరిధిలో పెండింగులో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను ఇరువురితో రాజీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి పి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్వాక్రా సంఘాలకు ఆర్థిక యాజమాన్యంపై గురువారం స్థానిక వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో శిక్షణ కల్పించారు. మండల సమాఖ్యలో జరిగే ఫైనాన్సియల్ మేనేజ్మెంట్ పాలసీపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎపిడి సావిత్రి మాట్లాడుతూ గ్రామ సంఘాల ఆర్థిక నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. అన్ని గ్రామ సంఘాలలో లీడర్ షిప్ మార్పు జరగాలని సూచించారు. ప్రతి విఒఎ కూడా పిఎంఎఫ్ఎంఇ యూనిట్స్ గ్రౌండింగ్ చెయాలన్నారు. ఈ కార్యక్రమంలో గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బి. బంగారమ్మ, ఎపిఎం ఎల్.సత్య నారాయణ, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని వైజంక్షన్ వద్ద గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో నడిపేన నవీన్‌కుమార్ (30) మృతిచెందాడు. స్థానిక డక్కినవీధికి చెందిన నవీన్ బైక్‌పై మరోవ్యక్తితో కలిసి వైజంక్షన్ నుంచి నగరంలోకి వస్తున్నాడు. విశాఖ నుంచి విజయనగరం వస్తున్న ఆర్‌టిసి బస్సును తప్పించుకుని ముందుకెళ్తున్న సమయంలో అదుపుతప్పి బస్సు కింద పడ్డారు. దీంతో నవీన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడ్డ నవీన్‌ను అదే బస్సులో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. బైక్‌పై ఉన్న మరోవ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ

8 మందికి గాయాలు

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని అంబటివలస వద్ద లారీ , ఆర్‌టిసిబస్సు ఢీకొన్న ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరందరినీ జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కిలోమీటరు మేర వాహనాలు రెండు గంటలకు పైగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బెల్ట్ షాపుపై దాడి

వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

తెర్లాం మండలం పెరుమాళిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు ఎస్ఇబి పోలీసులకు సమాచారం రావడంతో సిఐ ఆర్.జైభీమ్, ఎస్ఐ చిన్నంనాయుడు దాడి చేశారు. వ్యాపారి కె.సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 19 మద్యం సీసాలను సీజ్ చేశారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని జైభీమ్ హెచ్చరించారు.

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - లక్కవరపుకోట

దీర్ఘకాలంగా వెంటాడుతున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం గ్రీన్ అంబాసిడర్లు ధర్నా నిర్వహించారు. తొలుత చెరకు కాటా నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఒ దొరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మద్దిల రమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేలు జీతం చెల్లించాలని, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ, జి.కామేష్, జి.గంగరాజు పాల్గొన్నారు.

కిడ్నీరోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బండి నాగమణి వైద్య ఖర్చులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆర్థిక సాయం చేశారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగమణి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం చేయాలని బేబినాయనను మాజీ కౌన్సిలర్ బి.తవిటినాయుడు కోరడంతో ఆయన స్పందించి, సాయమందించారు.

వేపాడలో వర్షం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలో గురువారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సుమారు 45 నిమిషాలపాటు వర్షం పడింది. వరినాట్లు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ ఇఇ సురేష్ కుమార్ తెలిపారు. డిఆర్‌పేట, వల్లంపూడి, వేపాడ, బానాది, బల్లంకి, కొంపల్లి, కెఆర్‌పేట, ఎంకెఆర్‌పురం, నల్లబెల్లి, వావిలపాడు, వీలుపర్తి గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మానవాళికి ప్రాణవాయువు నిచ్చే మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు పిలుపునిచ్చారు గురువారం మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పద్మావతి నగర్ పార్కులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సౌజన్యంతో 200 మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను సమీపంలో ఉన్న సచివాలయ సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటడం వల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, మానవ జీవనానికి ప్రాణవాయువు కావాలన్నా మొక్కలు ఎంతో ఆవశ్యమైన విషయాన్ని చిన్నప్పటి నుంచే పిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.నరేష్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి నడుం బిగించాలి

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా గురువారం డెంకాడ మండలం పెదతాడివాడ పంచాయతీలో జిల్లా చిరంజీవి యువత, అంజనీపుత్ర చిరంజీవి ప్రజాసేవాసంఘం ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవ యువత ముఖ్య ప్రతినిధి, జనసేన ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీ రాజ్ మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా జనసేన సీనియర్ నాయకులు గురాన అయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి పుట్టినరోజును పురష్కరించుకుని మొక్కలు నాటడం ఎంతో అభినందనీయమని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. తుమ్మి అప్పలరాజు దొర, యువనాయకులు మదేటి బుజ్జి, జానకిరామ్, బీ.లింగం, లక్ష్మణ్, పొన్నగంటి గణేష్,బాబు,పొంతపల్లి నవీన్ పాల్గొన్నారు.

లక్ష్యసాధన దిశగా ఉద్యోగులు పనిచేయాలి

ప్రజాశక్తి- రేగిడి

లక్ష్య సాధన దిశగా ఉద్యోగులు పనిచేయాలని డిఆర్‌డిఎ పీడీ, మండల ప్రత్యేకాధికారి కళ్యాణ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు గురువారం రేగిడి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు తదితర నూతన కార్యాలయాలు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని గ్రామ సచివాలయాలు పూర్తయినప్పటికీ ప్రారంభించలే దన్నారు. పూర్తికాని ప్రభుత్వ కార్యాలయాలు ఈ నెల చివరి నాటికి పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీలు శరవేగంగా పనులు జరపాలన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు రక్షణ బిల్లు చెల్లింపులు జరపాలన్నారు. ఈయనతో పాటు ఎంపిడిఒ నాగమణి ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం


తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న పీడీ శాంతకుమారి

మండలంలోని పురిటిపెంట అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి గురువారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని, మంచినీటి కులాయిని, పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఒ నాగమణి, సూపర్‌వైజర్లు శకుంతల, గిరిజ, అంగన్వాడీ కార్యకర్త సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు పక్కన ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. జ్యూట్ మిల్లు పక్కన పట్టణానికి చెందిన త్రినాథ చెరువును కప్పేసి పశువులశాల నిర్మించారు. ఆక్రమణలు తొలగించాలని 31వ వార్డు కౌన్సిలర్ చోడిగంజి అనసూయమ్మ, వైసిపి నాయకులు చోడిగంజి రాజగోపాల్ అధికారులను కోరారు. చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ స్పందించి ఆక్రమణలు తొలగించాలని టిపిఒ వరప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో జెసిబితో ఆక్రమణలు తొలగించారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని 3, 4, 8, 9, 18వ వార్డులలో అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మిగారి కోనేరుగట్టు వద్ద వైఎస్ఆర్ సర్కిల్ సుందరీకరణకు రూ.10 లక్షలు కేటాయించామని చెప్పారు. అన్ని వార్డులలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ చెలికాని మురళి, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు బి.రమణమ్మ, అమ్మడమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి, వెల్దాం, రాయుడుపేట, సోంపురంలోని పాఠశాలలను గురువారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. హాజరుపట్టికను, విద్యార్థులకు ఇస్తున్న మెనూ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఇఒ బాల భాస్కరరావు